క్లుప్తంగా

సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

లక్సెట్టిపేట: ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీడీఎస్‌యూ పార్టీ ఆవిర్భవించి యాభై సంవత్సరాలు అవుతుందని, వేడుకలకు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది రెడ్డిమల్ల ప్రకాశం, నాయకులు కార్తీక్, చరణ్, సాగర్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు జరుపుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందారంలో సత్యనారాయణ హోటల్ నిర్వహించే సాంబయ్య ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్సై శ్రీధర్ పోలీసులతో కలిసి తనిఖీ చేయగా ఇందారం గ్రామానికి చెందిన వెన్న రాజేశ్, వెన్న వెంకటి, కాళ్ల కొమురయ్య, బద్దెల ప్రసాద్, వెన్న కుమార్, శ్రీరాంపూర్‌కు చెందిన ఐలయ్య, కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం సోనాపూర్‌కు చెందిన గంగు, అర్క భీం, శ్రీరాం తిరుపతి, శ్రీరాం రమేశ్ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని, తవ్వకాలు జరిపిన గడ్డపార, తట్ట, పారలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.

'రాథోడ్'కు నివాళి

జన్నారం: మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు రాథోడ్ రమేష్ జయంతి సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి పొంతం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జగన్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు గోపాల్, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నూర్: చెన్నూర్ బేతాళవాడ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పెండ్యాల శ్రీకాంత్ తండ్రి మృతి చెందాడు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అనంతరం కాలనీల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, తనుగుల రవికుమార్, పాతర్ల నాగరాజు, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న హెచ్‌ఎం, గ్రామస్తులు

జన్నారం: మండలంలోని మురిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన నల్లెల్లి సంతోశ్, తన్నీరు కోటేశ్వర్ రావులను పాఠశాల హెచ్‌ఎం హెచ్‌ఎం అజయ్‌కుమార్, సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజన్న, కొమురయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): సింగరేణిలో గెలిచిన కార్మిక సంఘంతో సమస్యలపై నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీబీటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు రామగిరి రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 2వ మంగళవారం నిర్వహించాల్సిన నిర్మాణాత్మక సమావేశం, ఇప్పటివరకు పది నెలలు గడిచినా నిర్వహించలేదని ఆరోపించారు. సమావేశాలు నిర్వహించి, కార్మిక సమస్యలు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో సరైన సిబ్బంది లేక, మిషినరీ లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్మికుల సమస్యలు కూడా పేరుకుపోయాయన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు నవీన్, సురేష్, రమేష్, నాగరాజు ఉన్నారు.

తాగునీటి గోస తీరేలా..?

- 'అమృత్ 2.0' కింద రూ.102 కోట్ల నిధులు మంజూరు
- మూడు మున్సిపాలిటీల్లో ఐదు ట్యాంకుల నిర్మాణం
- క్యాతన్‌పల్లిలో పనులు షురూ
- చెన్నూర్, మందమర్రిలో కొనసాగుతున్న సర్వే



క్యాతన్‌పల్లిలో కొనసాగుతున్న ట్యాంక్ పనులు

చెన్నూర్: తలాపునే తాగునీటి వనరులు ఉన్నా నియోజకవర్గ ప్రజలకు తాగునీటి తండ్లాట తప్పడం లేదు. వేసవి కాలంలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా పథకాల ద్వారా వాగులు, గోదావరి నదుల నుంచి తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు కాలం ఏదైనా తాగునీటి కోసం తిప్పలు పడుతున్నామని, నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0పథకం కింద జిల్లాలోని మూడు బల్దియాలకు రూ.102.50కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తయితే చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తీరనుంది.

మూడు మున్సిపాలిటీలలో..

చెన్నూర్, క్యాతన్‌పల్లి, మందమర్రి మూడు మున్సిపాలిటీల్లో అమృత్ 2.0పథకం ద్వారా రూ.102.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత నెలలో ట్యాంక్‌ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ పనులు అగ్రిమెంట్ ప్రకారం 2026నాటికి పూర్తికావాల్సి ఉండగా ఏడాది కాలంలో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీంతో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ట్యాంక్ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. చెన్నూర్, మందమర్రి మండలాల్లో పైపులైన్ల కోసం సర్వే నిర్వహిస్తున్నారు.

మున్సిపాలిటీల వారీగా నిధులు, పనులు

- చెన్నూర్ మున్సిపాలిటీకి అమృత్ 2.0పథకం ద్వారా రూ.31కోట్లు కేటాయించారు. ఈ నిధులతో మున్సిపాలిటీలో మూడు ట్యాంక్‌ల నిర్మాణంతో పాటు 51కిలో మీటర్ల పైపులైన్ పనులు చేపట్టాలి. 2000 నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి రూ.41.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండు ట్యాంక్‌లు, 56 కిలో మీటర్ల పైపులైన్‌తో పాటు 5వేల నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది.
- మందమర్రి మున్సిపాలిటీకి రూ.30కోట్ల నిధులతో 12కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మించి గోదావరి నది నుంచి తాగునీటి సరఫరా చేయాల్సి ఉంది. ఇందు కోసం సర్వే నిర్వహిస్తున్నారు.

గడువులోగా పూర్తయ్యేలా చూస్తాం

నియోజకవర్గంలో ఐదు ట్యాంక్‌లు, పైపులైన్ పనుల, నల్లా కనెక్షన్ల పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ట్యాంక్ నిర్మాణం కోసం పనులు జరుగుతున్నాయి. చెన్నూర్, మందమర్రిలో పైపులైన్ల కోసం సర్వే నడుస్తుంది. వారంలో సర్వే పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేస్తాం.

\- అనిల్, పబ్లిక్‌హెల్త్ ఏఈ

త్వరగా పూర్తి చేయాలి

మిషన్ భగీరథ పథకం లాభం లేకుండా పోయింది. నియోజకవర్గ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమృత్ 2.0 పథకం ద్వారా రూ.102.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని అధికారులను కోరాం. క్యాతన్‌పల్లిలో పనులు ప్రారంభమయ్యాయి.

\- గడ్డం వివేక్, ఎమ్మెల్యే, చెన్నూర్

లక్కీడ్రా ద్వారా వ్యాపారులకు స్టాళ్ల కేటాయింపు



పేర్లను ప్రకటిస్తున్న చైర్‌పర్సన్, పక్కన కమిషనర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కొత్తగా నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్లో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపికను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో ఆదివారం చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావులు పలువురు కౌన్సిలర్ల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించారు. మార్కెట్‌లో 108స్టాల్స్‌ను నిర్మించారు. ఈ మేరకు అన్నింటికీ లక్కీ డ్రా తీసి కూరగాయల వ్యాపారులకు కేటాయించారు. అనంతరం స్టాల్స్ కేటాయించిన లబ్ధిదారుల పేర్ల జాబితాను మున్సిపల్ నోటీసు బోర్డు, మార్కెట్ వద్ద అంటించారు. స్టాల్స్ దక్కించుకున్న వ్యాపారులు ఈ నెల 21వ తేదీ నుంచి నిర్దేశించిన స్టాల్స్‌లో అమ్మకాలు చేసుకోవాలని చైర్‌పర్సన్, కమిషనర్ సూచించారు. ఇకపై వ్యాపారులు రోడ్లపై కానీ, ఆరు బయట కానీ కూరగాయల అమ్మకాలు చేపట్టవద్దని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తే రూ.వెయ్యి జరిమానా వసూలు చేయడంతో పాటు సామగ్రిని జప్తు చేస్తామని హెచ్చరించారు. స్టాల్స్ రాని వ్యాపారులు మార్కెట్ భవనంలో కింద కూర్చొని అమ్మకాలు సాగించడానికి 46మందికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు డిపాజిట్ రూ.5వేలు, కిరాయి నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5గంటల వరకు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సురేష్, అశోక్, అఫ్సర్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనమెత్తిన కవ్వాల్



బోనాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామంలో గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాలు నిర్వహించారు. ఊరంతా డప్పు వాయిద్యాలతో మహిళలు బోనాలు ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి వెళ్లారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. సుమారు 500మంది మహిళలు, పురుషులు అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అనారోగ్య సమస్యలు లేకుండా తల్లీసల్లంగా చూడాలని మొక్కులు తీర్చుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కాశీరాం, శేషరావు, ధర్మ్‌నాయక్, గ్రామ పెద్దలు నర్సాగౌడ్, బాల గౌడ్, మల్లేష్ గౌడ్, వంగ శ్రీనివాస్, నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే 'కమ్యూనిటీ కాంటాక్ట్'



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నరేందర్

దండేపల్లి: ప్రజల భద్రత కోసమే పోలీస్‌శాఖ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లక్సెట్టిపేట సీఐ నరేందర్ తెలిపారు. దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేశారు. ధృవపత్రాలు, నంబర్ ప్లేట్ లేని 16వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ప్రజలతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ధృవపత్రాలు కలిగి ఉన్న వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. వాహనాలు కలిగి ఉన్న వారు వాహన ధృవపత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కూడా కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయాలను కొనసాగించాలి



కాసిపేట మండలం సాలేగూడలో నివాళులర్పిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట: ఆదివాసీ అమరుడు కుమురంభీం ఆశయాలను యువత కొనసాగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండలంలోని సాలేగూడలో ఆదివారం కుమురంభీం వర్ధంతిని ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి విగ్రహానికి నివాళులర్పించారు. ఆదివాసీ హక్కుల గురించి ఐకమత్యంగా ఉద్యమించాలని నేటి యువత కుమురంభీంను స్ఫూర్తిగా తీసుకొని హక్కుల కోసం ముందుండి పోరాడాలని తెలిపారు. ఆదివాసీ ప్రజలు, పటేళ్లు, నాయకులు, మహిళలు, యువత పాల్గొని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ యూత్ ప్రెసిడెంట్ సిడాం గణపతి, ఉపాధ్యక్షుడు పేంద్రం ప్రభాకర్, నాయకులు మడావి మాణిక్ రావు, మోతీరాం, ఆత్రం జంగు, గంగారాం, పేంద్రం శంకర్, బాపురావు, సోము పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: పూలమాల వేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: స్వర్గీయ కుమురం భీం వర్ధంతి దినోత్సవాన్ని మండలంలోని నాయకులు ఆదివాసీలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చౌరస్తా వద్ద ఉన్న కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

కేసులకు భయపడేది లేదు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ నేతలపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తప్పుడు కేసులను పెట్టించి, ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం మాట్లాడారు. తనతోపాటు తన కుమారుడు విజిత్‌రావుపై, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై తప్పుడు కేసులను పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. వీటికి భయపడేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే యువతను గంజాయికి బానిస చేసి మంచిర్యాలలో అలజడి సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం లిఫ్ట్ ఇరిగేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, రహదారులపై ఎమ్మెల్యే ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మంచిర్యాల-అంతర్గాం మధ్య గోదావరిపై బ్రిడ్జిని ఎందుకు వద్దంటున్నారో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. హాజీపూర్ మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత మాట్లాడుతూ తన భర్త శ్రీనివాస్‌పై తప్పుడు కేసు బనాయించి జైల్లో పెట్టారని ఆరోపించారు. సమావేశంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, గాదె సత్యం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జన్నారం: మండలంలోని పొన్కల్ పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు శెట్‌పల్లి గంగయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శెట్‌పల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కందుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరు శ్రీనివాస్, కోశాధికారిగా దోమల భాస్కర్, ప్రచార కార్యదర్శిగా అంజన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు తెలిపారు.

'రైతుభరోసా'పై భగ్గుమన్న బీఆర్‌ఎస్

- రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో
- పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపణ



చెన్నూర్: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన



వేమనపల్లి: రోడ్డుపై బైఠాయించి ధర్నా

నెన్నెల/చెన్నూర్/జన్నారం/తాండూర్/వేమనపల్లి: రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చడాన్ని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట మేరకు తక్షణం రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షకాలం పంట సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన రైతుబంధ్‌ను ఎగ్గొట్టిందని మండిపడ్డారు. రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని హెచ్చరించారు. చెన్నూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు నిరసనకారులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. జన్నారంలో, తాండూర్ ఐబీ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తాండూర్‌లో పోలీసులు వచ్చి బలవంతంగా నాయకులు, రైతులతో రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమాల్లో నెన్నెలలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, నాయకులు అశోక్‌గౌడ్, కొయ్యడ శ్రీనివాస్, చెన్నూర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లెల దామోదర్‌రెడ్డి, కృష్ణ, మంత్రి బాపు, అనిల్, ఆశీస్, జడల మల్లేశ్, వెంకటేశ్, కొండపర్తి వెంకటరాజం, నాయబ్, జన్నారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భరత్ కుమార్, మున్వర్ అలీఖాన్, విజయధర్మ, వినయ్‌కుమార్, జాడి గంగాధర్, రమేష్ గౌడ్, జనార్దన్, రాజేష్‌యాదవ్, మల్లేష్, తాండూర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బా దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గట్టు సంతోష్, నాయకులు దత్తు, పురుషోత్తం గౌడ్, చంద్రశేఖర్, దాగం నారాయణ, మొగిలి, శంకర్, క్రిస్టఫర్, జాడి పోశం, వేమనపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం, లక్ష్మీకాంత్, లక్ష్మణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నెన్నెల: నిరసన తెలుపుతున్న నాయకులు



తాండూర్: రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో



జన్నారం: రాస్తారోకో చేస్తున్న నాయకులు

అకాల వర్షం.. రైతన్న ఆగమాగం



కొండపల్లిలో నేలకొరిగిన వరి

- నేలవాలిన వరి, తడిసిన పత్తి

భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అకాల వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. పంట చేతికొచ్చే దశలో ఈదురుగాలులతో శనివారం రాత్రి హాజీపూర్, భీమారం మండలాల్లో వర్షం పడడంతో వరి నేలవాలింది. పత్తి పూర్తిగా తడిసింది. ప్రభుత్వం, వ్యవసాయాధికారులు స్పందించి పంటనష్టంపై సర్వే జరిపి నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించేలా చూడాలని కోరుతున్నారు.



భీమారం: పోలంపల్లి శివారులో నక్కరాజన్న పొలంలో నేలవాలిన వరి

'రిజర్వేషన్ల ఎత్తివేతకు కుట్రలు'



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

జన్నారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ఏబీసీడీ వర్గీకరణను చేస్తామంటూ ప్రకటించడం రిజర్వేషన్ల ఎత్తివేతలో భాగమేనని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేష్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. రిజర్వేషన్లను ఎత్తివేసి దళితులను రాజ్యాధికారానికి దూరం చేయడమే రాజకీయ లక్ష్యంగా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మాల, మాల ఉప కులాలు ఐక్యమత్యంతో పోరాడి హక్కుల సాధన కోసం ముందుండాలని జాతి సమైక్యతను చాటు కోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సర్వేల పేరిట ఆలస్యం చేయకుండా జనగణన పూర్తి చేసి ఎవరి హక్కు ఎంతో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

మేదరిపేట కేంద్రంగా పటిక, బెల్లం అమ్మకాలు!



వాహనంలో రహస్యంగా తీసుకు వచ్చిన పటిక బస్తాలు

దండేపల్లి: గుడుంబా తయారీకి అవసరమయ్యే, పటిక, బెల్లం అమ్మకాలకు దండేపల్లి మండలం మేదరిపేట కేంద్రంగా మారింది. మేదరిపేటలోని పలు కిరాణ దుకాణాల్లో పటిక, బెల్లం అమ్మకాలు, గుట్టుగా సాగిస్తున్నారు. మేదరిపేటకు సమీపంగా ఉన్న పలు గ్రామాల్లో కొంతమంది గుడుంబా తయారు చేస్తుండటంతో, వారికి అందుబాటులో ఉండేలా ఇక్కడ పలువురు వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ తదితర ప్రాంతాల నుంచి కొందరు వ్యాపారులు వాటిని గుట్టుగా వాహనాల్లో ఇక్కడకు చేరవేసి, విక్రయించడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి నిషేధిత పటిక, బెల్లం అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.